

దాతల సాయం..

దాతల సహకారంతో ఎన్మేపల్లి జెడ్పీహెచ్ఎస్ రూపురేఖలు మారిపోయాయి. రూ.6లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. 8లో▸



వ్యాధులకు చెక్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు ప్రబలవని బండ్లగూడ కమిషనర్ జి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. 8లో▸



దేశ సమైక్యతకు కృషి

దేశ సమైక్యత కోసం పాటుపడుతున్న సంస్థ బజరంగ్‌దళ్ అని పాలమూరు విభాగ్ సంయోజక్ రమేశ్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రికి క్రిస్మస్ శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

డాలర్స్ హిల్స్‌లో కొండచిలువ కలకలం



ప్రహరీ లోపలికి వచ్చిన కొండ చిలువ

మణికొండ: నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి ప్రహరీలోకి కొండ చిలువ రావటంతో కార్మికులు భయాంకు గురయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్స్‌హిల్స్ కాలనీలో డాక్టర్ అవినాష్ నూతన ఇంటి నిర్మాణం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 అడుగుల కొండ చిలువ ప్రహరీ గోడ లోపలికి వచ్చింది. ఓ మూలన ఉన్న డస్ట్ బిన్ పక్కన చేరి బుసలు కొట్టింది. అటుగా వెళ్లిన వారు దాన్ని గమనించి యజమానికి తెలిపారు. దీంతో ఆయన స్నేక్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి సంచిలో దానిని బంధించారు. కొండచిలువను జూపార్క్‌లో అప్పగిస్తామని తెలిపారు.

అందాల భవనానికి అరుదైన గౌరవం!

ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్‌మార్క్ గుర్తింపు



ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీ భవనానికి అరుదైన గౌరవం దక్కింది. నిజాం హయాంలో 1939లో నిర్మితమైన భవనానికి ప్రతిష్టాత్మక భారత ప్రభుత్వ ట్రేడ్ మార్క్ గుర్తింపు లభించింది. ట్రేడ్‌మార్క్ నిబంధనల ప్రకారం ఆర్ట్స్ కాలేజీ భవనం ఫొటోను ఇతరులు ఉపయోగించకూడదు. ఇక నుంచి ఈ భవనం ఫొటోను ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు, విద్యా సంస్థలు, కాలేజీలు, వ్యాపార సంస్థలతో పాటు క్రీడాకారుల బహుమతులు, వివిధ రకాల వస్తువులు, గృహాలంకరణ గిఫ్ట్‌లు, టీ కప్పులు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు, డైరీలు తదితరాలపై ముద్రించకూడదు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలు, వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ట్రేడ్ మార్క్ ఉన్న భవనాలు మన దేశంలో రెండే ఉన్నాయి. ముంబైలోని తాజ్‌మహల్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాలు కాగా.. ఇప్పుడు ఈ జాబితాలో ఆర్ట్స్ కాలేజీ చేరింది.

ప్రతిష్టను పెంచేందుకు..

మారిన పరిస్థితులకు అనుకూలంగా ఆర్ట్స్ కాలేజీ భవన ప్రతిష్టను పెంచేందుకు ట్రేడ్ మార్క్ కోసం ఈ ఏడాది ఏప్రిల్‌లో జాతీయ స్థాయి మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో దరఖాస్తు చేయగా భారత ప్రభుత్వ గెజిట్ ఈ నెల 2న ప్రచురితమైందని ఓయూ న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి చెప్పారు. జనవరి 15 వరకు ట్రేడ్ మార్క్ సర్టిఫికెట్ చెన్నై కార్యాలయం నుంచి జారీ కానున్నట్లు ఆయన తెలిపారు. సర్టిఫికెట్ జారీ అయిన వెంటనే ఓయూ వీసీ ప్రొ.కుమార్ అధికారికంగా ప్రకటించనున్నట్లు జీబీ రెడ్డి చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

కొడంగల్: నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ చేయనున్నారు. జిల్లా అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కొడంగల్‌లో బీసీ గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులకు భూమి పూజ, ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయానికి శంకుస్థాపన, దుద్యాల్ పీఎస్ ప్రారంభం, హకీంపేటలో జూనియర్ కళాశాల, హైస్కూల్ భవన నిర్మాణానికి భూమి పూజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించనున్నారు.



తగ్గేదేలే..!

సిటీ శివారులో న్యూ ఇయర్ పార్టీలకు ఏర్పాట్లు

- బుక్కింగ్ పూర్తయిన ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు
- ఈవెంట్ల నిర్వహణకు మూడు దరఖాస్తులే
- అనుమతి లేకుంటే చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

మొయినాబాద్: పాత సంవత్సరానికి వీడ్కోలు.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించేందుకు నగర శివారుల్లోని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో ఈవెంట్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎలాంటి వేడుకలు, ఈవెంట్స్ నిర్వహించినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

లిక్కర్‌కు ఎక్సైజ్.. డీజేకు పోలీసుల అనుమతి

హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో వందల సంఖ్యలో ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని వీఐపీలు, రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులవి ఉన్నాయి. మరి కొన్ని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లను ఈవెంట్లు, వేడుకలు నిర్వహించేందుకు అద్దెకు ఇస్తున్నారు. వీఐపీలు, ప్రముఖుల ఫాంహౌస్‌లలో వారి కుటుంబ సభ్యులే న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకునే అవకాశం ఉంది. అద్దెకు ఇచ్చే ఫాంహౌస్‌లు, రిసార్ట్‌ల్లో న్యూ ఇయర్ వేడుకలు, ఈవెంట్స్‌ను నిర్వాహకులు చేపట్టనున్నారు. వాటికి తప్పనిసరిగా పోలీసులు నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వేడుకల్లో లిక్కర్ వాడితే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. డీజే వాడితే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నిబంధనలు బేఖాతరు

చాలా వరకు ఫాంహౌస్‌లు, రిసార్ట్‌ల్లో నిర్వహించే ఈవెంట్స్, వేడుకలకు అనుమతులు తీసుకోకుండా, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లపై దాడులు చేసి అనుమతి లేకుండా నిర్వహించే ఈవెంట్లు, వేడుకలను భగ్నం చేస్తున్నారు. అయినా ఫాంహౌస్‌లు, రిసార్ట్‌ల నిర్వాహకులు భయపడటంలేదు. మామూళ్లకు అలవాటు పడిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

బుకింగ్‌లు పూర్తి

డిసెంబర్ 31న రాత్రి నిర్వహించే న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఇప్పటి వరకు ఒక్క ఫాంహౌస్ నిర్వహకుడు కూడా అనుమతి తీసుకోలేదు. వేడుకలకు ఐదు రోజుల సమయమే ఉన్నా ఇప్పటి వరకు అనుమతులకోసం దరఖాస్తులు చేయడంలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహస్‌లు ఉన్నాయి. వీటిలో సుమారు 600 ఫాంహౌస్‌లను వేడుకలు, ఈవెంట్లకు అద్దెకు ఇస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలకోసం ఈ ఫాంహౌస్‌లు అన్ని బుక్ అయినా పోలీసుల అనుమతి తీసుకోకపోవడం గమనార్హం.

అనుమతులు తప్పనిసరి



న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే రిసార్ట్స్, ఫాంహౌస్‌లు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ముందే చెప్పాం. ఇప్పటి వరకు మూడు రిసార్ట్స్ యజమానులు ఈవెంట్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఫాంహౌస్‌ల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అనుమతి లేకుండా వేడుకలు, ఈవెంట్స్ నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్



మొయినాబాద్: మెథడిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ తదితరులు

క్రిస్మస్ సందడి

జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. అందంగా ముస్తాబు చేసిన చర్చిల్లో క్రీస్తు జననం గురించి వివరిస్తూ మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్‌లు చేసి అనంతరం మత పెద్దలు బైబిల్ వాక్యాలు వినిపించి క్రీస్తు బోధనలు వివరించారు.



ఇబ్రహీంపట్నం: చర్చిలో మహిళల ప్రార్థనలు



శంకర్‌పల్లి చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్ రత్నం తదితరులు

దూరదృష్టి కలిగిన నేత.. వాజ్‌పేయి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: దూరదృష్టి కలిగిన అతికొద్ది మంది నేతల్లో అగ్రగణ్యుడు అటల్ బిహారి వాజ్‌పేయి అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శంకర్‌పల్లి చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వాజ్‌పేయి దూరదృష్టి కారణంగానే భారతదేశం ప్రస్తుతం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, మండల అధ్యక్షుడు రాములు, మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, వెంకటేశ్, బయన్న, నర్సింహారెడ్డి, వీరేందర్, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలుచర్చిలకు వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

చలి.. చినుకులు..

నగరంలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బుధవారం తెల్లవారుజామున నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పగలంతా ఆకాశం మబ్బులు కమ్మేసి మేఘావృతమైంది. సూరీడు కారుమబ్బుల చాటుకు పరిమితమయ్యాడు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు డిగ్రీలు తక్కువ నమోదయ్యాయి. గరిష్టంగా 28, కనిష్టంగా 19.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి పూట చలిలో మంచుతో పాటు చిరుజల్లులు కురిశాయి. డిసెంబర్ నెలాఖరుకు చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. కానీ.. ఒకేసారి వాతావరణ మార్పుతో కొంత ఆహ్లాదకరంగా కనిపించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతోనే ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. చిరుజల్లులతో వాహనాల వేగం తగ్గడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా పలు ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

నీటి బిల్లు.. గుండెలు గుభేల్

పేదలకు పెను భారం

- ఒక్కో ఇంటిపై రూ.18వేల నుంచి రూ.20వేల వరకు బకాయి
- మాజీమంత్రి సబితారెడ్డిని ఆశ్రయించిన గాంధీనగర్ వాసులు
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ

బడంగ్‌పేట్: ముప్పై ఏళ్ల క్రితం ఉపాధి వెతుక్కుంటూ పొట్ట చేతబట్టుకుని పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి బడంగ్‌పేట్‌కు వలస వచ్చారు. మహాత్మా గాంధీజీ పేరుపెట్టుకుని గుడిసెలు వేసుకుని పొట్ట కూటికి ప్రయాణం సాగించారు. అప్పట్లో గుడిసెలు కూల్చివేయడంతో ధర్నాలు, పోరాటాలు చేస్తూ గూడు కల్పించాలని ఆయా ప్రభుత్వాలను వేడుకోగా చలించిన నాటి ప్రభుత్వాలు ఇళ్లలేని పేద కుటుంబాలను గుర్తించి హుడా లేవుట్ చేసి ప్రతీ కుటుంబానికి 60 గజాల చొప్పున ఇంటి జాగలను లీగల్‌గా కేటాయించి సర్టిఫికెట్లను అందచేసింది. ఇప్పుడు గుడిసెల స్థానంలో రేకులు ఉన్నాయి. కానీ వీరికి హెచ్ఎండీఏ మెట్రో వాటర్ వారు నీటి బిల్లులు వేయడంతో ఆ బిల్లులు భారంగా మారాయి.



అప్‌గ్రేడ్ అయ్యాక అదనపు భారం

బడంగ్‌పేట కార్పొరేషన్ ఏర్పాటుకు ముందు 2013 వరకు బడంగ్‌పేట గ్రామ పంచాయతీ కొనసాగుతూ ఉండేది. అందులో గాంధీనగర్ ఒక స్లమ్ ఏరియా. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యాక తాగునీటి సరఫరా బాధ్యత హెచ్ఎండీఏకు (మెట్రోవాటర్)కు అప్పగించారు. దీంతో బిల్లుల మోత మోగుతోంది. ఒక్కో ఇంటికి ఇప్పటి వరకు రూ.18 వేల నుంచి 20 వేల వరకు బిల్లులు రావడంతో గాంధీనగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ 800కు పైగా ఉన్న నివాసాలకు సుమారు రూ.1.50 కోట్లకు పైగా మెట్రో వాటర్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. దీంతో మెట్రో వాటర్ అధికారులు, సిబ్బంది నుంచి ఒత్తిడి పెరగడంతో వారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆశ్రయించారు. పాత మెట్రో బిల్లులు మాఫీ చేసేలా చూస్తే కొత్తగా వచ్చే బిల్లులు తగ్గిస్తే ప్రతీ నెల చెల్లించుకుంటామని ఇటీవల ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన సబితారెడ్డి మెట్రో ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పాత నల్లా బిల్లులు మాఫీ చేసి న్యాయం చేసేలా చూస్తానని గాంధీనగర్ వాసులకు హామీ ఇచ్చారు.

95 శాతం మంది కూలీలే..



గాంధీనగర్‌లో 95 శాతం మంది రోజు కూలీలే. ఏళ్ల క్రితం వేసుకున్న రేకుల ఇళ్లు ఇప్పటికీ అలానే ఉన్నాయి. 60 గజాలల్లోనే తల్లితండ్రులు, పిల్లలు, పిల్లల పిల్లలు అందులోనే కాపురాలు చేస్తున్నాం. తాగునీటికి రూ.20 వేలు కట్టమంటే ఎక్కడ నుంచి తెస్తాం. ఎమ్మెల్యే సబితా రెడ్డి స్పందించి బిల్లులు మాఫీ చేయించాలని విన్నవించుకున్నాం. మేడం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నా.

– మల్లేష్, గాంధీనగర్

గాంధీనగర్ వాసుల పక్షాన ఉంటాం



మెట్రోవాటర్ బిల్లులు కట్టలేమని పేదలు గాంధీనగర్ వాసులు మొరపెట్టుకుంటున్నారు. గతంలోనే ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చా. ఈ భారం తగ్గించేలా చూడాలని సబితారెడ్డిని కోరుతున్నా. గాంధీనగర్ వాసుల పక్షాన ఉండి ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో మెట్రో బిల్లులు మాఫీ చేసేలా పోరాడుతాం. మెట్రో అధికారులు వీరి బిల్లులపై మరో మారు ఆలోచించాలి.

– శోభారెడ్డి, కార్పొరేటర్, 29వ డివిజన్

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

ఇద్దరు నగర వాసుల దుర్మరణం

- మరో ఐదుగురికి గాయాలు
- భువనగిరి పట్టణంలో రోడ్డు ప్రమాదం

భువనగిరిటౌన్: స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చి వెళ్తుండగా.. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో వివిధ కాలనీలకు చెందిన అర్జున్, శ్రీరాం మితిన్, శ్రీను, సుంకరి మణిజయంత్, యశ్వంత్ (17) స్నేహితులు. వీరంతా బుధవారం తెల్లవారుజామున అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ సూఫియాన్ అలియాస్ రహీం (27) ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని అతడితో పాటు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు బయల్దేరారు. అదే కారులో అబ్దుల్ సూఫియాన్ బంధువు షాకీబ్ కూడా ఉన్నాడు. ఉదయం 7 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని స్వామివారి దర్శనం పూర్తిచేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట–భువనగిరి మధ్యలో ఓ హోటల్ వద్ద కారును ఆపి టిఫిన్ చేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొని అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న అబ్దుల్ సూఫియాన్‌తో పాటు వెనుక కూర్చున్న యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి.

భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలింపు..

సమాచారం తెలుసుకున్న భువనగిరి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. షాకీబ్‌తో పాటు మితిన్, మణిజయంత్‌కు తీవ్ర గాయాలవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం వాహనంలో ఇరుక్కుపోయిన సూఫియాన్, యశ్వంత్ మృతదేహాలను పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



యశ్వంత్ (ఫైల్)

సెలవు రోజు కావడంతో..

అర్జున్, యశ్వంత్, మణిజయంత్, శ్రీరాం మితిన్, శ్రీను హైదరాబాద్‌లోనే వివిధ ప్రాంతాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీను, అర్జున్, మితిన్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, యశ్వంత్ నారాయణగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో, మణిజయంత్ నల్లకుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారు. క్రిస్మస్ సందర్భంగా కళాశాలకు రెండు రోజులు సెలవులు ఇవ్వడంతో స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్టకు వచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

శాంతినగర్‌లో విషాదఛాయలు

రామంతాపూర్: తమ ఒక్కగానొక్క కుమారుడు యశ్వంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రామంతాపూర్ శాంతినగర్‌కు చెందిన శ్రీనివాస్, మాధవి దంపతుల దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కుమారుడి మరణ వార్త తెలియగానే శ్రీనివాస్ దంపతులు భువనగిరి జిల్లా ఆసుపత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. సోదరుడి మరణంతో యశ్వంత్ సోదరీమణులు భవ్య, సమీక్ష బోరుమంటూ విలపిస్తున్నారు.

జల్సాలకు మరిగి.. చోరీలు చేసి



పట్టుబడిన నిందితులు

పట్టుబడిన ట్రాన్స్‌ఫార్మర్ తీగల చోరులు

మహేశ్వరం: కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లలను చోరీ చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన రోహింగ్యాలు హమీద్ హుస్సేన్, నూర్ అలాం, షఫీ అలాం, మహ్మద్ షఫీ, మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ ఫరూఖ్ అలీలు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 14న శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామ సమీపంలో ఉన్న స్టైల్లింగ్ వెంచర్‌లో ఉన్న 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో నుంచి రాగి తీగలను దొంగిలించారు. మరుసటి రోజు సెక్యూరిటీగార్డులు గమనించి వెంచర్ యజమానికి సమాచారం అందించడంతో మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మొదట ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలను పరిశీలించి మయన్మార్ దేశానికి చెందిన ఆరుగురు దొంగతనం చేసినట్లు గుర్తించారు. అనంతరం వారిని అరెస్టు చేసి రూ.4.31 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



బండ్లగూడలోని చర్చి వద్ద పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: వ్యక్తిగత... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు ప్రబలకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిల వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... క్రిస్మస్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, తౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.



ల్యాండ్ ఫార్మా సంస్థ అందించిన ఫర్నిచర్



యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ సంస్థ ద్వారా వేసిన పెయింటింగ్

దాతల సాయం.. బడికి భాగ్యం

- సర్వాంగ సుందరంగా ఎన్కెపల్లి ప్రభుత్వ పాఠశాల
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: సర్వాంగ సుందరంగా తయారైన తరగతి గదులు, ఆకర్షణీయమైన గోడలు, తళుక్కున మెరిసే బ్లాక్ బోర్డులు, పక్కన మహనీయుల వ్యాఖ్యలు... వింటుంటేనే ఇదేదో ప్రైవేటు పాఠశాల అనే భావన మనస్సులో కలుగుతుంది. కానీ మండల పరిధిలోని ఎన్కెపల్లి జెడ్పీ పాఠశాలలో వీటన్నింటినీ వీక్షించవచ్చు. దాతల సహకారంతో బడి రూపురేఖలే మారిపోయాయి. దాదాపు రూ.ఆరు లక్షలు వెచ్చించి పాఠశాలలో గోడలకు రంగులతో పాటు బ్లాక్ బోర్డులు, గోడల పైన బొమ్మలు, కొటేషన్‌లు, మెరుస్తున్న పెయింటింగ్‌లు వేశారు. ఇవే కాకుండా ఫర్నిచర్, విద్యార్థులకు కావాల్సిన డెస్క్ బెంచీలు, కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు, బీరువాలు సమకూర్చారు. దీంతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా జెడ్పీహెచ్ఎస్‌లో మౌలిక వసతుల కల్పన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నూతనంగా వేసిన రంగులతో కళకళలాడుతోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆకర్షణీయంగా బడి

ఎన్కెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ సంస్థ, ఐ వాలంటీర్ రూ.మూడు లక్షలు వెచ్చించి పెయింటింగ్, బొమ్మలు, బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. లాండ్ ఫార్మా అధినేత డాక్టర్ రవీంద్ర గండి మైసమ్మ సంస్థ ఆధ్వర్యంలో రూ.మూడు లక్షలతో డెస్కులు, బీరువాలు, కంప్యూటర్ టేబుల్స్, ఫర్నిచర్ సమకూర్చారు. దీంతో ప్రభుత్వ బడులు ప్రైవేటు స్కూల్ కంటే ఆకర్షణీయంగా తయారైంది.

వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం



దాతల సహకారం మరువలేనిది. యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ సంస్థ, ఐ వాలంటీర్, లాండ్ ఫార్మా అధినేత డాక్టర్ రవీంద్ర సంస్థల ద్వారా రూ.6 లక్షలు వెచ్చించి పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో పాఠశాల కొత్త రూపు సంతరించుకుంది. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 128 మంది విద్యార్థులున్నారు. గతేడాది పదిలో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసారి పదో తరగతిలో 28 మంది విద్యనభ్యసిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, ఎన్కెపల్లి

అదుపు తప్పి..విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



కారు ఢీకొట్టడంతో కూలిన విద్యుత్, కేబుల్ స్తంభాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్ ప్రధాన రోడ్డులోని పోచమ్మ ఆలయం సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. భెల్ చౌరస్తా నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఈ కారు (ఏపీ 28 సీజె 5379) డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి ఎలక్ట్రికల్ , నెట్ కేబుల్ స్తంభాలను ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అలాగే విద్యుత్ స్తంభం ధ్వంసమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ విభాగం అధికారులు వెంటనే స్పందించి సరఫరా నిలిపివేసి..మరమ్మతు పనులు చేపట్టి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రమోషన్లల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ లెక్చరర్స్ సంఘం సమావేశం అధ్యక్షులు కె.సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ ప్రమోషన్లల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న మాదిరిగానే బీసీలకు కూడా ఎట్రాసిటీ ప్రొటెక్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాముడి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్, కోశాధికారి బుడిగే కొండయ్య, ఉపాధ్యక్షులు పరశురాములు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, స్రవంతి, వెంకటరాములు, మోడల్ స్కూల్ ప్రతినిధి జమలాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

గచ్చిబౌలి: ఈ నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి..చికిత్స పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న బుధవారం తెలిపిన వివరాల మేరకు..ఈ నెల 23న రాత్రి 1.50 గంటకు నానక్‌రాంగూడ రోటరీ నుంచి సర్వీస్ రోడ్‌లో నార్సింగి వైపు బైకుపైలో యువకుడు స్నేహితురాలితో కలిసి వెళ్తుండగా వెనుకనుంచి స్కోడా కారు ఢీకొట్టిన విషయం విదితమే. ఈ ఘటనలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని శివాని అదే రోజు మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన వెంకటరమణారెడ్డి (26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన వెంకటరమణారెడ్డి తన స్నేహితురాలైన శివానిని హాస్టల్‌లో డ్రాప్ చేసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య ఇద్దరికి చేరింది. నిందితుడైన కాలేష్ (29)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘రోల్‌బాల్’లో జాతీయ స్థాయికి ఎంపిక



ఫాతిమాను అభినందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలో ఉన్న వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని హుదా ఫాతిమా జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే యాదయ్యను స్కూల్ యాజమాన్యం, విద్యార్థిని తల్లిదండ్రులు మార్యదపూర్వకంగా కలిశారు. ఆరో తరగతి చదువుతున్న హుదా ఫాతిమా ఇటీవల శంషాబాద్‌లో జరిగిన జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కర్రె శివ ప్రసాద్, మాజీ సర్పంచ్ జహంగీర్, విద్యార్థిని తల్లి దండ్రులు పాషా, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికుల సంక్షేమానికి కృషి

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు టి.సంజీవరెడ్డి

ముషీరాబాద్: వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా తనను గెలిపిస్తే కంపెనీలోని 386 మంది కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ టి.సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగు ఇంక్రిమెంట్లు, ప్రతి నెల నాలుగు వేల షిఫ్టింగ్ బెనిఫిట్స్ వచ్చేలా చూస్తానని చెప్పారు. బుధవారం అడిక్‌మెట్‌లో సంజీవరెడ్డి గ్రూప్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027లో జరిగే లాంగ్ టర్మ్ అగ్రిమెంట్ (ఎల్‌టీఏ)లో ప్రతి కార్మికుడి డీఏను సరిసమానంగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. వీఎస్టీ అజామాబాద్‌లో ఉన్న వర్కింగ్ కండిషన్‌ను తూప్రాన్‌లో కూడా కొనసాగించేందుకు తూప్రాన్‌లోని వీఎస్‌టీ కంపెనీలో 24 గంటల ఎమర్జెన్సీ వ్యాన్ ప్రయాణ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అపాయింట్‌మెంట్లలో అవినీతి జరగకుండా నిజాయితీగా రిక్రూట్‌మెంట్ జరిగేలా చూస్తామన్నారు. కార్మికులు తూప్రాన్‌కు వెళ్లి వచ్చేందుకు మంచి కండీషన్ గల బస్సు సౌకర్యం కల్పిస్తామని, కంపెనీలో మంచి క్యాంటీన్, వైద్య సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ప్రస్తుతం ఉన్న యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కంపెనీని తూప్రాన్‌కు తరలించి కార్మికులకు అన్యాయం చేశారని సంజీవరెడ్డి ఆరోపించారు. ఈ నెల 28న జరిగే ఎన్నికల్లో కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని త్రాసు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సంజీవరెడ్డి గ్రూప్ కార్మిక నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్, శ్రీనివాస్ యాదవ్, నాగేష్, సమద్, జానకిరాం, కృష్ణారెడ్డి, డి.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌యాదవ్, ఎస్.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు కృషి



ఎన్నికైన బజరంగ్‌దళ్ నూతన కార్యవర్గం సభ్యులు

చేవెళ్ల: దేశ సమైక్యత కోసం నిరంతరం పాటుపడుతున్న సంస్థ బజరంగ్‌దళ్ అని పాలమూరు విభాగ్ సంయోజక్ గూడెం రమేశ్ అన్నారు. బుధవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ జిల్లా శిక్షణవర్గ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ జిల్లా నాయకులు చేవెళ్ల బజరంగ్‌దళ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల బజరంగ్‌దళ్ సంయోజక్‌గా డి.అనిల్‌కుమార్‌ముదిరాజ్, సహ సంయోజక్‌గా గణేశ్, అనిల్, గోరక్ష సంయోజక్‌గా మల్లేశ్, ధర్మప్రసార్‌గా రాఘవేంద్రచారి, విద్యార్థి సంయోజక్‌గా విశ్వేశ్వర్‌లను నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రసాద్ చిలుకూరి శ్రీనివాస్, బజరంగ్‌దళ్ కార్యకర్త ధనుష్‌రెడ్డి, సందీప్, నవీన్, వెంకటేశ్, శివకుమార్, వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షులు జగదీశ్వర్, అధికార ప్రతినిధి శశిదర్, భిక్షమయ్య, ప్రశాంత్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాలంటూ యువతిపై కత్తితో దాడి

వ్యక్తి రిమాండ్

మలక్‌పేట: ప్రేమించాలంటూ ఓ యువతినిపై కత్తితో దాడి చేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ వివరాల ప్రకారం.. మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ రోడ్ నంబర్–10లో నివాసముండే విజయలక్ష్మిని అదే ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకట్(30) ప్రేమించాలంటూ వేధింపులకు గురి చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విజయలక్ష్మి భవనం టెర్రస్‌పైకి వెళ్లగా వెంకట్ ఆమెపై కత్తితో దాడి చేయడంతో చేతికి స్వల్ప గాయాలయ్యాయి. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకుంటానని లేదంటే చంపేస్తానని బెదిరించాడు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం వెంకట్‌ను ట్ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనుమానాస్పదంగా రైతు మృతి

తాండూరు రూరల్: వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిట్టబాసుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దప్ప(52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 21న ఆయన తన సోదరి వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో అందరూ అక్కడికే వెళ్లాడని భావించారు. కానీ బుధవారం తన పొలంలో సిద్దప్ప అనుమానాస్పదంగా పడి ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అలాగే కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించగా ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య అడివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే సిద్దప్ప మద్యం తాగేవాడని.. గతంలో చాలాసార్లు ఇంటి నుంచి వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మోమిన్‌పేట: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ అరవింద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ అరవింద్ మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతాల నుంచి అనధికారికంగా నగదు బదిలీ, తస్కరణకు గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకర్లు మీ డబ్బులు విత్‌డ్రా కాకుండా నిలుపుదల చేస్తారన్నారు. స్మార్ట్ ఫోన్‌లలో వచ్చే లింకులు, ఓటీపీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బైకుల దొంగ ఆటకట్టు

- ప్రభుత్వ ఆస్పత్రులే టార్గెట్‌గా చోరీలు
- 9 బైకులు స్వాధీనం
- చోరీ బైకుల కొనుగోలుదారులూ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, విడిభాగాలతో పోలీస్ అధికారులు, సిబ్బంది

చిలకలగూడ: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులను టార్గెట్ చేసుకుని ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడు, దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేస్తున్న ముగ్గురు రిసీవర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లతో కలిసి చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి బుధవారం వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా తీగలకుంట దక్కన్ బేకరీ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీర్ అలియాస్ మహ్మద్‌హాషమ్ ఉరఫ్ షేక్ హాసమ్(28) వృత్తిరీత్యా ఏసీ మెకానిక్. అఫ్జల్‌గంజ్‌లోని పెట్రోల్ పంప్‌లో కొన్నాళ్లు పనిచేసి తర్వాత ఏసీ మెకానిక్‌గా పనిలో చేరాడు. మద్యం, గంజాయిలకు బానిసైన సమీర్ విలాసవంతమైన జీవితం గడిపేందుకు సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి విక్రయిస్తున్నాడు.

తల్లిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి...

అస్వస్థతకు గురైన తల్లిని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించిన నిందితుడు సమీర్ కొన్ని రోజులు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రుల పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదని గమనించాడు. రోజుల తరబడి పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి మారు తాళాలతో వాటిని చోరీ చేయడం ప్రారంభించాడు. ఉస్మానియా, గాంధీ, ప్రభుత్వ యునానీ ఆస్పత్రుల్లో పార్కింగ్ చేసిన మొత్తం 9 వాహనాలను చోరీ చేసి, ముషీరాబాద్‌లోని స్క్రాప్ వ్యాపారులకు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన చిలకలగూడ పోలీసులు ఆస్పత్రుల సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుని ఆటకట్టించారు. ఉస్మానియాలో 4, గాంధీలో 4, యునానీ ఆస్పత్రిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. సమీర్‌తో పాటు చోరీ వాహనాలను కొనుగోలు చేసిన ముషీరాబాద్ స్క్రాప్ వ్యాపారులు మహ్మద్ యూసఫుద్దీన్ అలియాస్ లడ్డు, మహ్మద్ మొయిజుద్దీన్, మహ్మద్ ఖాజాహుస్సేన్‌లను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, విడిభాగాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ లేనందున ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ మండల ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కాలే రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం బస్‌స్టాప్ రోడ్డులో సుమారు 50 మంది కార్మికులు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ పెరిగినందున అక్కడ ఆటోలు ఆపడం ఇబ్బందిగా మారిందన్నారు. చౌరస్తాలోని పిల్లర్ నెంబర్లు 319–320ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కొందరు ద్విచక్ర వాహనాలను ఆపి వెళ్లిపోతున్నారన్నారు. ఆ స్థలంలో ఆటోలు పార్క్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అయితే ఇందుకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించి షరతులతో కూడిన అనుమతి ఇచ్చారన్నారు. ఒకవేళ రాబోయే రోజుల్లో ఆప్రాంతంలో గ్రీనరీ లేదా రోడ్డు డెవలప్‌మెంట్ అయితే ఆటోల అడ్డాను పక్కకు జరపాల్సి ఉంటుందని సూచించారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన మున్సిపల్ కమిషనర్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అడ్డాను రెండు పిల్లర్ల మధ్యలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సీఐటీయూ ఆరాంఘర్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తి వేయాలి

దుద్యాల్: లగచర్ల ఘటనలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని రోటిబండ తండా, పులచర్లకుంట తండాలో ఇంటింటికి తిరుగుతూ ఈ నెల 30న హకీంపేట్‌లో నిర్వహించే సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ భూముల కోసం పోరాటాలు చేస్తుంటే రైతులపై అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన చేసి ఎలాంటి షరతులు లేకుండా కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవాడకు కూడా భూములను ప్రజల అంగీకారం లేకుండా తీసుకోవద్దన్నారు.